# శంకుస్థాపన జరిగి పుష్కర కాలం



నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న ఖాజాగూడ ఇండోర్ స్టేడియం

## -ప్రభుత్వాలు మారిన ప్రారంభానికి నోచుకోని ఖాజాగూడ స్టేడియం

## -కొత్త ప్రభుత్వంలోనైనా గ్రహణం వీడేనా...


నిర్మాణ వ్యర్థాలు, సామాగ్రితో డంపింగ్ యార్డుగా మారిన ఖాజాగూడ గ్రౌండ్



**గచ్చిబౌలి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

రాష్ట్రాలు విడిపోయాయి... ప్రభుత్వాలు మారాయి... శంకుస్థాపన చేసి పుష్కర కాలం దాటింది... నిర్మాణం పూర్తయి దశాబ్దం కావస్తుంది. కానీ ఖాజాగూడ మినీ స్టేడియానికి పట్టిన గ్రహణం మాత్రం వీడడం లేదు. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ఖాజాగూడ మినీ స్టేడియం నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించి, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరుగక ముందే శిథిలావస్థకు చేరుకుంటుంది. ఐటి కారిడార్ పరిధిలో ఉన్న ఏకైక జీహెచ్ఎంసీ గ్రౌండ్‌ను మినీ స్టేడియం పేరుతో స్థానిక యువతకు దూరం చేసిన పాలకులు ఆటస్థలాన్ని కాస్తా డంపింగ్ యార్డుగా మార్చారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఖాజాగూడ మినీ స్టేడియంకు పట్టిన గ్రహణం వీడుతుందా అని స్థానిక యువత ఆశతో ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ గ్రామం సర్వే నెంబరు 27లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్ విస్తరించి ఉంది. గతంలో చుట్టు ప్రక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల క్రీడోత్సవాలు, వార్షికోత్సవాలకు, ఐటి కారిడార్‌లో ఉన్న చిన్నచిన్న సాఫ్ట్‌వేర్ సంస్థల క్రీడా వేడుకలకు ఈ గ్రౌండ్ వేదికగా నిలిచేంది. ఐటి కారిడార్ పరిధిలో ఉన్న ఏకైక జీహెచ్ఎంసీ గ్రౌండ్ ఇది కావడంతో స్థానిక యువత క్రీడలకు ఉపయోగించుకోవడంతో ఎప్పుడూ క్రీడాకారులతో కళకళలాడేది. ఐటి కారిడార్ మద్యలో ఉన్న ఈ గ్రౌండ్‌ను అభివృద్ది చేయాలని సంకల్పించిన ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం ముందుకు వచ్చింది. 2012 జూలై 21వ తేదీన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా 2.10కోట్ల రూపాయల వ్యయంతో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. కొత్తలో జోరుగా సాగిన పనులు రాష్ట్ర విభజన నేపథ్యంలో నిలిచిపోయాయి. అనంతరం ప్రత్యేక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి పనులను వేగవంతం చేసింది. గతంలో కేటాయించిన నిధులు కరిగిపోవడంతో మరో 26 లక్షలను జీహెచ్ఎంసీ మంజూరు చేసింది. అవీ సరిపోకపోవడంతో అనంతర కాలంలో మరో 11లక్షలను మంజూరు చేయడంతో చివరికి ఇండోర్ స్టేడియం పూర్తయింది. 2700 గజాల విస్తీర్ణంలో 4విశాలమైన బాడ్మింటన్ కోర్టులు, క్యారమ్స్ గదులు, మల్టి జిమ్, క్రీడాకారుల అవసరాల కోసం గదులను సిద్ధం చేశారు.

**పట్టిన గ్రహణం... ఏళ్లుగా నిరుపయోగం...**

నిర్మాణం మొత్తం పూర్తయిన ఖాజాగూడ ఇండోర్ స్టేడియంకు గ్రహణం పట్టడంతో ఏళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఈ ఇండోర్ స్టేడియంను ఓ క్రీడాకారిణికి అప్పగించేందుకు ప్రయత్నించగా, స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో నిర్మాణం పూర్తయిన స్టేడియంను ప్రారంభించకుండా సంవత్సరాలుగా తాళాలు వేసి ఉంచడంతో ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంది. స్టేడియం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రెడిమిక్స్ ప్లాంట్ పెట్టి యధేచ్ఛగా వాడడం, ఓవైపు జీహెచ్ఎంసీ చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో నేడు ఖాజాగూడ గ్రౌండ్ డంపింగ్ యార్డుగా మారింది. గ్రౌండ్‌కు ఓవైపు ఉన్న ఖాళీ స్థలం సందట్లో సడేమియాగా అక్రమాణకు గురై నిర్మాణాలు వెలిశాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను అధికారులు ఓ వైపు ప్రారంభించకుండా గాలికి వదిలేయగా, మరోవైపు స్థానిక యువత కళ్లముందు ఇండోర్ స్టేడియం ఉన్నా ఉపయోగించుకోలేని దీనస్థితిలో ఉన్నారు. గతంలో మాదిరిగా ఖాళీగా ఉన్నా తాము ఆటల కోసం ఉపయోగించుకునే వారమని, ఇండోర్ స్టేడియం పేరుతో అందుబాటులో ఉన్న జీహెచ్ఎంసీ గ్రౌండ్‌ను తమకు దూరం చేశారని యువత వాపోతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం,కొత్తగా వచ్చిన అధికారులైనా కల్పించు కొని ఖాజాగూడ ఇండోర్ స్టేడియంను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

హైదరాబాద్ వార్త



# తెల్లకార్డులు లేనివారికి అన్యాయమేనా..!

## -ఆరు గ్యారంటీలకు తెల్లరేషన్ కార్డు లింక్
## -అర్హతలున్నా కార్డు లేకపోవడంతో అయోమయం
## -గత పదేళ్ళుగా దరఖాస్తుదారులకు అందని కొత్త రేషన్‌కార్డులు




**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు జరుపుతామని దరఖాస్తులు చేసుకోమన్నారు. ఎన్నికలకు ముందు గాని, దరఖాస్తుల సమయంలో కాని తెల్లరేషన్ కార్డులు ప్రామాణికం అని చెప్పకుండా పథకాలు అమలు జరిపే సమయంలో తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం పట్ల పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నుండి లక్షలాధిమంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు జరపుతామని ప్రకటించడంతో పాటు ఎలాంటి నియమ, నిబంధనలు తెలుపకపోవడంతో దారిద్ర రేఖకు దిగువనున్న వారే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, ఇతర పెద్దయెత్తున ఆదాయం ఉన్నవారు కూడా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా దాదాపు కోటీ 20లక్షల దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ. 5లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచారు.

తాజాగా మరో రెండు గ్యారంటీలు అమలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్‌ల వరకు ఉచిత కరెంటు, మరోకటి మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందజేయడం. వీటికి సంబంధించి ఆయా శాఖల అధికారులు కసరత్తు జరుపుతున్నారు. అర్హులైన వారందరికి అమలు జరుపడం కోసం వివరాలను సేకరిస్తున్నారు.ఈ రెండు పథకాలకు తెల్లరేషన్ కార్డు ఉన్నవారినే అర్హులుగా పరిగణిస్తున్నారు. వంటగ్యాస్ కనెక్షన్‌దారులు వివరాలు దృవీకరించుకునేందుకు అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. వీటన్నిటిని పూర్తి చేసిన అనంతరం లబ్దిదారులకు 200 యూనిట్‌ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతో పాటు రూ. 500లకే వంటగ్యాస్‌ను అందజేయనున్నారు. ప్రభుత్వం గతనెల ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించి వాటికి సంబంధించిన వివరాలను పోర్టల్‌లో నిక్షిప్తం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 89లక్షల 99వేల తెల్ల రేషన్‌కార్డులు ఉపయోగంలో ఉండగా అంతకంటే ఎక్కువగా రూ. 500లకు గ్యాస్ సిలిండర్‌కు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. అంటే తెల్లరేషన్ కార్డులు ఉన్నవారే కాకుండా ఇతరులు కూడా గ్యాస్‌సిలిండర్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 91లక్షల 49వేల838 దరఖాస్తులు అందాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1కోటీ 21లక్షల గ్యాస్ వినియోగదారులు ఉండగా వీరిలో దాదాపు నాలుగున్నర లక్షల మంది గివ్ ఇట్ అప్‌లో భాగంగా గ్యాస్‌పై వచ్చే రాయితీని వదులుకున్నారు. తెల్లరేషన్ కార్డులు ఉన్నవారు. ప్రతీ సంవత్సరం దాదాపు సగటున 6 సిలిండర్‌లు వినియోగిస్తున్నారని అంచనా. ఈ లెక్కన రూ. 500లకు సిలిండర్ అందజేస్తే ప్రభుత్వంపై పడే భారాన్ని లెక్కిస్తున్నట్లుగా సమాచారం. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాలకు కలిసి దాదాపు 60లక్షల గృహ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 20లక్షల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు అందాయి.జీహెచ్ఎంసీ పరిధిలో 14లక్షల 4వేల 84 దరఖాస్తులు అందాయి. మెడ్చల్‌లో 1లక్షా 81వేల 437 దరఖాస్తులు అందగా రంగారెడ్డి జిల్లాలో 3లక్షల 99వేల 866 దరఖాస్తులు అందజేశారు. మూడు జిల్లాలకు కలిపి 19లక్షల 85వేల దరఖాస్తులు అందజేశారు. ఇందులో దాదాపు 7లక్షల మంది 200 యూనిట్‌ల విద్యుత్తు వాడేవారైతే మిగిలిని 12లక్షల పైచిలులకు వినియోగదారులు కేవలం 100 యూనిట్‌లలోపే విద్యుత్ వినియోగిస్తున్నారు.

**ముందుగా తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాల్సింది...**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన తరువాత ఆరు గ్యారంటీలకు తెల్లరేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావించి ఉంటే ప్రజాపాలనలో ముందుగా తెల్లరేషన్ కార్డులు కొత్తగా ఇవ్వడం కోసం దరఖాస్తులు తీసుకొని అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డులు మంజూరు చేసిన తరువాతనే ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉచిత విద్యుత్, రూ. 500లకే వంటగ్యాస్ లాంటి పథకాలు కొత్త తెల్లరేషన్ కార్డుల అందజేసిన అనంతరం ఆమలు జరిపే ప్రయత్నం చేస్తే పేద ప్రజలకు న్యాయం జరిగేదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికల కారణంగా రాష్ట్రంలో సుమారు 22 లక్షల తెల్లరేషన్ కార్డులను రద్దు చేసింది. దీంతో పాటు దాదాపు పది సంవత్సరాలుగా తెల్లరేషన్ కార్డులను వందల సంఖ్యలో తప్ప ఇచ్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చినట్లుగా కాకుండా తెల్లరేషన్ కార్డులను అర్హతలకు ప్రామాణికంగా తీసుకోవడం పట్ల మండిపడుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పథకాలకు తెల్లరేషన్ కార్డు ఉండాలని ముడిపెట్టడం మాత్రం జనాలు జీర్ణించుకోవడం లేదు. ఎన్నికలకు ముందుగాని, దరఖాస్తుల సమయంలో కాని ఎక్కడా కూడా తెల్లరేషన్ కార్డుదారులు మాత్రమే అర్హులని ప్రకటించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో బిజెపి అనుకూల పవనాలు వీస్తున్నాయి : కిషన్ రెడ్డి దీమా

## -బిజెపిలో చేరిన పి.ఎల్ శ్రీనివాస్


సికింద్రాబాద్ ఎస్.వి.ఐటీ. ఆడిటోరియంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరుతున్న పి.ఎల్.శ్రీను తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

గ్రేటర్‌లో ప్రత్యేక స్థానం సంపాధించుకున్న పి.ఎల్.శ్రీనివాస్ ఆయన కుమార్తె అలేఖ్య వారి అనుచరులతో బిజెపి పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. పి.ఎల్.శ్రీనివాస్‌తో పాటు వందలాది మంది బిజెపి పార్టీలో చేరిన సందర్భంగా గురువారం సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలోని ఎస్.వి.ఐటీ. ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణలో బిజెపికి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. తెలంగాణలో ఎక్కడికి వెళ్లిన ఈసారి బిజెపికి ఓటు వేయాలని ప్రధాని మోడీకి వేస్తామని రైతులు,మహిళలు, విద్యావంతులు,యువతీ, యువకులతో పాటు అన్నివర్గాలో ప్రజల్లో చర్చజరుగుతుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. అదే విధంగా నేటి యువత సేవాలాల్ చూపిన బాటలో నడవాలన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటామని దీమా వ్యక్తం చేశారు. పి.ఎల్.శ్రీనివాస్, ఆయన కూతురు అలేఖ్యలతో వందలాది మంది బిఆర్ఎస్ నాయకులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ల సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. వారికి కండువకప్పి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావ్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి సీనియర్ నాయకులు శ్యామ్ సుందర్ గౌడ్, మేకల సారంగపాని తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి క్రాస్ రోడ్స్‌లో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానము శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయం ధర్మాధికారి కళావి ఎస్.జనార్దనమూర్తి, సీఈవో, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ విఆర్‌గౌరీశంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు వరుసగా విష్ణుసహస్రనామ పారాయణాలు, స్వామివారికి అర్చన అనంతరం బాలభోగం, నివేదన అనంతరం మంగళనీరాజనం, మంత్రపుష్పం భక్తులకు తీర్థప్రసాత వితరణ జరిగింది. నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాదగోష్ఠి, నిత్యహోమం, ఉత్సవమూర్తులకు అభిషేకం, నివేదన, మంత్రపుష్పం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి, హోమం, బలిహరణం, కోట్నాల వసంతోత్సవం, చక్రస్నానము, బలిహరణం, తీర్థప్రసాదగోష్ఠి కార్యక్రమం జరిగింది. విష్ణుసహస్రనామపారాయణాలు, తదుపరి ధ్వజ అవరోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణములు, పవళింపుసేవ, రుత్విక్ సన్మాణ కార్యక్రమం జరిగింది.


హోమాది కార్యక్రమాలను నిర్వహించిన దృశ్యం

# బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహరాజ్

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆర్ బద్రునాయక్ ఆధ్వర్యంలో బోగు బండార్ కార్యక్రమంలో నియోజకవర్గం శాసనసభ్యులు మాదవరం కృష్ణారావు డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌లు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా శ్రీ దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, గోపాల్ నాయక్, ఆర్ కల్యాణ్ నాయక్, భాస్కర్ నాయక్ పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహేద్ షరీఫ్, టీఆర్ఎస్ రాజు, సి.బ్రహ్మ, కొండమ్ శ్రీనివాస్ రెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్ హాల్లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

### బాస్ సేవలు ఇతర స్వచ్ఛంద సంస్థ

# సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

## -ఐటి కమిషనర్ బాలకృష్ణ


అన్నదానం కోసం అయోధ్యకు తరలిస్తున్న నిత్యావసర లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 15ప్రభాతవార్త:**

అయోధ్యలోని భవ్య,రామమందిరం తిలకించడానికి వచ్చే రామ భక్తులకు భాగ్యనగర్ అయ్యప్పసేవాసమితి ఆద్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం గొప్పవిషయమని ఆల్ఇండియా మఠ్‌మందిరం అధ్యక్షులు ఎం.రామారాజు, ఐటి కమీషనర్ బి.బాలకృష్ణలు పేర్కొన్నారు.ఈ మేరకు ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి ప్రధాన కార్యాలయం వద్ద అయోధ్యకు తరలివెళ్లే నిత్యావసర సరుకుల లారీనివిహెచ్‌పి జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవినూతల శశిధర్,విరంచి ఆసుపత్రి చైర్మన్,లతమ్మ ఫౌండేషన్ చైర్మన్‌మాధవిలతలతో కలిసి జెండాను ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కారణాలతోతల్లిదండ్రులను కోల్పోయిన అనాథ చిన్నారులను హక్కును చేర్చుకుని,వారికి విద్యను,వసతి భోజన కల్పించడంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.బాస్ ఆద్వర్యంలో అయోధ్యలోని హన్‌మాన్‌గడ్ వద్ద ప్రతిరోజు సుమారు 30వేల మంది రామభక్తులకు ఉదయం ఆల్పహారం,మధ్యాహ్నం భోజనం వంటఉచితంగా అందచేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలోబాస్ అద్యక్షులు క్యాతం రాధాకృష్ణ,ప్రధాన కార్యదర్శి విజయబాస్కర్,కోశాధికారి మేడిశెట్టి రాకేష్, వెంకటేష్‌గురుస్వామి,విజేందర్‌రెడ్డి,నర్సింగ్‌రావు,వై.అశోక్,ఎన్.జగదీష్,సంతోష్,బిక్షపతి,దేవేందర్,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మూసీ కబ్జాను అడ్డుకోవాలని కమిషనర్‌కు వినతి


మంచిరేవుల గ్రామం వద్ద జరుగుతున్న మూసీనదీ కబ్జా అడ్డుకోవాలని నార్సింగి కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

**నార్సింగి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవుల గ్రామం వద్ద ఓఆర్ఆర్ సమీపంలో జరుగుతున్న మూసీనది కబ్జాను అడ్డుకోవాలని మంచిరేవుల గ్రామానికి చెందిన నాయకులు కమీషనర్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సాయి కుమార్, మైలారం రంజిత్, ఏర్పుల నర్సింగ్‌రావ్, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్‌లు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఓపెన్‌గా ఉన్న మూసీ నదిలో ఇటీవల కొంత మంది కబ్జాదారులు రాత్రి వేళల్లో భారీ ట్రక్కులలో డస్ట్ తీసుకు వచ్చి నింపుతున్నారన్నారు. ఇప్పటికే వందల కొలది ట్రాక్టర్లు, ట్రక్కులతో నిర్మాణం జరుగుతున్న భవనాల నుంచి వెలువడ్డ డస్ట్‌ను తెచ్చి మూసీలో వేసి కబ్జా చేస్తున్నారని తెలిపారు. ఇంత భారి ఎత్తున మూసీ నదిలో డంప్ చేసి కబ్జా చేస్తుంటే సంబంధిత ఇరిగేషన్ అధికారులు కిమ్మనకుండా ఉండడం దారుణమని పేర్కొన్నారు. ఈ మూసీ నదీ కబ్జాను ఆపాలని కోరుతూ ప్రజాదర్బార్‌లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని, గురువారం నార్సింగి మున్సిపల్ కమీషనర్ ప్రదీప్‌రెడ్డికి కూడా వినతిపత్రం అందజేశామని వివరించారు. వీలైనంత త్వరగా మూసీ నదిలో డస్ట్ వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను కోరామని తెలిపారు.

# శేరిలింగంపల్లి చెరువులను పరిశీలించిన అడ్వకేట్ కమిషనర్లు

## -చెరువుల ఆక్రమణపై హైకోర్టుకు సీల్డ్ కవర్ నివేదిక సమర్పించనున్న అధికారులు


శేరిలింగంపల్లి చెరువులను పరిశీలిస్తున్న అడ్వకేట్ కమిషనర్లు, అధికారులు

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు అడ్వకేట్ కమీషనర్ల కమిటీ గురువారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని చెరువులను పరిశీలించింది. చెరువుల ఆక్రమణపై హైకోర్టులో నమోదైన కేసులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అధారే చెరువుల పరిశీలన కోసం అడ్వకేట్ కమీషనర్లను నియమించారు. ఈమేరకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి గురువారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని పలు చెరువులను పరిశీలించిన అడ్వకేట్ కమీషనర్లు చెరువుల ఆక్రమణ, శిఖం స్థలం, చెరువుల స్థితిగతులపై నివేదికను తయారు చేసి సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు చెరువుల ఆక్రమణపై గమణ ప్రభుత్వేతర ఆర్గనైజేషన్ ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ అనీల్ సి.దయాకర్ 2007లో హైకోర్టులో పిర్యాదు చేశారు. ఈ పిర్యాదుపై కేసు నమోదు చేసిన హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 16 చెరువుల స్థితిగతులపై సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంటూ అడ్వకేట్ కమీషనర్లను పరిశీలన కోసం నియమిస్తూ ఫిబ్రవరి 6వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అధారే ఆదేశాల మేరకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా గాడి ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ రెవెన్యూ ప్లీడర్ టి.శ్రీకాంత్‌రెడ్డిలను చెరువుల పరిశీలన కోసం నియమించింది. ఈమేరకు అడ్వకేట్ కమీషనర్లు జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి ఈనెల 12వ తేదీన ఉమ్మడి సమావేశం నిర్వహించారు. అనంతరం గురువారం సంబంధిత అధికారులతో కలిసి శేరిలింగంపల్లి మండల పరిధిలోని మాదాపూర్ దుర్గం చెరువు, నానక్‌రాంగూడ మేడికుంట, గౌలిదొడ్డి గోశాయికుంట, నల్లగండ్ల పెద్దచెరువు, గంగారాం పెద్దచెరువులను జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువుల విస్తీర్ణం, ఆక్రమణకు గురైన ప్రాంతం, శిఖం స్థలం వివరాలను సేకరించారు. అడ్వకేట్ కమీషనర్ల కమిటీ పరిశీలించిన వివరాలను నివేదిక తయారు చేసి 3వారాల్లో సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించనున్నారు. శేరిలింగంపల్లితో పాటు మేడ్చల్ మల్కాజిగిరిలో ఉన్న చెరువులను శుక్రవారం పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. చెరువులను పరిశీలించిన వారిలో జీహెచ్ఎంసీ లేక్ ప్రొటెక్షన్ అధికారి శివకుమార్ నాయుడు, జిల్లా భూసర్వే ల్యాండ్ ఏడి శ్రీనివాస్, శేరిలింగంపల్లి తాహశీల్దార్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

# మాదాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## -ఒకరి మృతి ఇద్దరికీ తీవ్ర గాయాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

నగరంలోని మాదాపూర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా..ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు యువకులు బైక్‌పై మాదాపూర్ ఖానమెట్ వైపు నుంచి నోవాటెల్ హోటల్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. నాక్ ప్రధాన ద్వారం వద్ద అతివేగంతో చెట్టును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న అజయ్ (27) తీవ్ర రక్త స్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న శరత్ (25), అందె అజయ్ (25)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని స్థానిక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. శరత్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వీరందరూ జగిత్యాల జిల్లాలోని కోరుట్ల గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓ.యూ ఏసీపీగా జగన్ పదవీ బాధ్యతల స్వీకరణ

**తార్నాక, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ ఏసీపీగా గ్యార జగన్ గురువారం పదవీబాధ్యతలు స్వీకరించారు. పోలీసు అధికారుల బదిలీల్లో భాగంగా జగన్ ఓ.యూ ఏసీపిగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. అంబర్‌పేట్‌లో పీటీసీలో ఏసీపీగా ఉన్న జగన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఓ.యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసి విద్యార్థులు, విద్యార్థినేతలతో ఫ్రెండ్లీగా ఉంటూ మంచి పేరుతెచ్చుకున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన జగన్ ఎస్సైగా మొదట అచ్చంపేట, వనపర్తి రూరల్, మాద్గుల, బాల్‌నగర్, పేట్ బషీరాబాద్‌తో పనిచేశారు. ఓ.యూలో జగన్ ట్రబుల్ షూటర్‌గా పేరుతెచ్చుకున్నారు. ఇన్స్‌పెక్టర్‌గా ఇంటలిజెన్స్‌లో, కీసర, బొల్లారం, బేగంపేట్, ఓ.యూలో పనిచేశారు. ఏసీపీగా హెచ్ఎండీఏ, పీటీసీలో పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఏసీపీ జగన్ చేసిన సేవలకు 100 రివార్డులు, పలు అవార్డులు వరించి మంచి అడ్మినిస్ట్రేటర్ గా పేరుతెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ గజన్ మాట్లాడుతూ ఓ.యూ లో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో ఇక్కడ సంపూర్ణ అవగాహణ ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా చూస్తానని పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఐటి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాలి

**-ఐటీపరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్**



సిపిగుర్నానికి అవార్డు అందిస్తున్న జయేష్‌రంజన్, మనిషా సాబూ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** విద్యార్థులకు ఐటీకంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తే ఆయా కంపెనీల్లో జరిగే కార్యకలాపాలను నేర్చుకుని నైపుణ్యం కలిగిన విద్యార్థిలాగా కళాశాల నుంచి బయటకు వస్తారని తెలంగాణ రాష్ట్ర ఐటీపరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. ఈమేరకు హెచ్ఐసిసిలో జరిగిన హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ ) జాతీయ సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల చివరి సంవత్సర విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు 3,6,9 నెలలపాటు ఆయా కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం డిజైన్ చేసి వారికోసం మెంటర్‌లను నియమించాలని సూచించారు. దీంతో విద్యార్థులు కొత్తగా కోచింగ్ తీసుకోవడం, అనుభవం కోసం రకరకాల మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యాసంవత్సరం అయిపోతుండగానే నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగావకాశం వచ్చేలా చేయాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈసందర్భంగా టెక్‌మహేంద్ర సిఈవో, ఎండీ సిపి గుర్నానికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో టిసిఎస్ అధ్యక్షులు వి.రాజన్న, సెయింట్ సిఈవో కార్తిక్ నటరాజన్, బిసిజి సౌరభ్ చంద్ర, హైసియా అధ్యక్షురాలు మనిషా సాబూ, ఎస్‌టిపిఐ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

### వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**-డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముదిగొండ భవానీ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయేందర్‌కుమార్ సూచించారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో ఉచిత దంత వైద్య ఆరోగ్య నిర్వహించారు. వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకుని అనేక సూచనలు, సలహాలను స్వీకరించారు. క్యాంప్ ప్రతినిధి డాక్టర్ నదీమ్ మాట్లాడుతూ దంత పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ యూనిట్ 1,2,3 ఎన్.కుమారస్వామి, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ పి.మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లిలోని పవిత్రమైన షిరిడిసాయిబాబా దేవాలయంలో ఆలయం నిర్మాణ సమితి ఆధ్వర్యంలో ఆలయం వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో బాబావారికి ఆలయం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చనాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయం వ్యవస్థాపక వైస్‌చైర్మన్ రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ధర్మరాజ్‌గౌడ్‌తో కలిసి మాజీ కార్పొరేటర్, ఆలయం కోశాధికారి వి.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సిరిగిరి శ్యామ్, ప్రకాశ్, కార్తీక్‌యాదవ్, సిద్దిక్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా కంది సుబ్బారావు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కంది సుబ్బారావును ఆ పార్టీ నేతలు చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ఘనంగా సత్కరించి అభినందించారు. టిపిసిసి కార్యదర్శి పాశం అనీల్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరుగ్యారెంటీ పథకాలను అర్హులకు చేరేవేసే విదంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సుబ్బారావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ నేతగానే కాకుండా ఎంతో సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు శీలం సత్యనారాయణ, బంటారం యాదగిరిగౌడ్, మేడి సురేశ్, సురేశ్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

### బౌద్ధనగర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ లో పలు కార్యాక్రమాలను నిర్వహించారు. బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో న్యూ అశోక్ నగర్, బౌద్ధనగర్ రామాలయం వద్ద హెల్త్‌క్యాంప్ జరిపారు. రోగులను పరీక్షించిన వైద్యులు వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే ఆధార్ కార్డులో చిరునామా మార్పులు, పలువురికి జీరో బ్యాంక్ అకౌంట్‌లను అందజేశారు. కార్యాక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, కన్నాభిరాం, ఓం ప్రకాశ్, సత్యనారాయణ, నాగమణి, యాదమ్మ, కొమురయ్య, సు బ్బారావు, శ్యామరాజ్, విశ్వనాథ్, అశోక్, రాజు, సత్యనారాయ ణలు పాల్గొన్నారు.

### పేద బ్రాహ్మణులను ఆదుకోవటానికి దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ నిరంతరం కృషి



కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ ప్రతినిధులు

**చార్మినార్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** పేద బ్రాహ్మణులను ఆదుకోవటానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తున్నదని దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ అధ్యక్షులు రాంకుమార్ తివారీ అన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పేద బ్రాహ్మణ విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గురువారం పాతబస్తీ అంబికానగర్‌లోని కన్యకుబ్జ్ భవనంలో 9 మందికి ఉపనయం కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాకేష్ తివారీ, ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ పాండే, కోశాధికారి గోపాల్ ప్రసాద్ శుక్లా, సంయుక్త కార్యదర్శి భవానీ ప్రసాద్ తివారీ, ప్రతినిధులు బాలప్రసాద్ తివారీ, రాజేంద్ర ప్రసాద్ తివారీ, శోభ దూబే, జయశంకర్ తివారాతో పాటు పలువురు పాల్గొన్నారు



మహేంద్రహిల్స్‌లో సేవాలాల్ జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న లంబాడీలు శ్రీరామ్ నాయక్ తదితరులు



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



జయంతి వేడుకలో ఎమ్మెల్యే



సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

# ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి..

**మహేంద్రహిల్స్‌లో**

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** అణగారిన వర్గాలు, గిరిజనులు లంబాడీల సంక్షేమం కోసం సేవాలాల్ మహరాజ్ చేసిన సేవలు అమోగమని లంబాడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీరామ్ నాయక్, అడ్వైజర్ బి.రాజయ్య నాయక్, మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు టి.పద్మజా, నర్సింగ్‌లు తెలిపారు. సేవాలాల్ జయంతిని వేడుకలను పురస్కరించుకొని గురువారం మహేంద్ర హిల్స్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.క్రిష్ణా నాయక్, టీ.లక్ష్మినాయక్, శాంతమ్మ, మణెమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

**మట్‌పోర్ట్ బంజారా హాట్స్‌లో**

సేవాలాల్ మహారాజ్ ఆశీసుస్సలతోనే లంబాడ గిరిజనులు దినదినం అభివృద్ధి చెందుతున్నారని కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం మట్‌పోర్ట్ బంజారా హాట్స్‌లో నిర్వహించిన సేవాలాల్ మహారాజు జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలు నాయక్, మేఘ నాయక్, సోమ్‌లా నాయక్, నరేశ్ నాయక్, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేటలో**

**నిజాంపేట్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** నిజాంపేట్ కార్పోరేషన్ పరిధిలో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్పోరేటర్ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలను హన్మంత్‌రెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అల్వాల్‌లో..**

**అల్వాల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ జయంతి వేడుకలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. గురువారం ఇందిరా నగర్‌లో లంబాడా సమాజం ఆద్వర్యంలలో జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సంత్ సేవా లాల్ మహారాజ్ సేవలు అద్వితతీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రరమంలో మున్యా నాయక్, రవి నాయక్, గోపాల్ నాయక్, రాజు నాయక్, హరి నాయక్, బాలు నాయక్, బాలరాజు నాయక్, లక్ష్మణ్ నాయక్, ప్రభాకర్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

**మైలార్‌దేవ్‌పల్లిలో..**

**మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** బంజారా ఆరాధ్య దైవమైన సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి గురువారం బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ కాలనీ, న్యూ గ్రీన్ సిటీ బుద్వేల్‌లో ఘనంగా జరిగింది. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. భోగ్ బండారో, అన్నదానం, బైక్ ర్యాలీ, సేవాలాల్ మహారాజ్ శోభా యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి కన్వీనర్ ఆర్.శ్రావణ్, నరేష్ యాదవ్, సన్నీ రాజ్, బంజారా నాయకులు వి శ్రీ హరి నాయక్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎం.లక్ష్మణ్ నాయక్ ఉపాధ్యక్షులు, ఎన్.గణేష్ ప్రధాన కార్యదర్శి, తేజావత్ శ్రీనివాస్ నాయక్ గౌరవ అధ్యక్షులు, జె.రాజు నాయక్ కోశాధికారితో పాటు పలువురు పాల్గొన్నారు.

# 21 నుంచి 29వరకు “ మాదిగల జోడోయాత్ర ”

**-ఎస్సీకార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పిడమర్తి రవి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లకోసం ఫిబ్రవరి 21 నుంచి మాదిగల జోడోయాత్ర తొలివిడత ప్రారంభమవుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేపీసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21న హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో యాత్ర ప్రారంభమై పిబ్రవరి 29న వరంగల్‌లో ముగుస్తుందన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంట్ ప్రవేశపెట్టనందుకు తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అనవాళ్లు లేకుండా చేయడం కోసం ప్రతిజిల్లాలో మాదిగలను ఐక్యం చేయడానికి మాదిగల జోడోయాత్ర చేస్తున్నామని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి రామాలయం మీద ఉన్న ప్రేమ సబండ వర్గాలపై లేదని అన్నారు. కింది కులాలకు ఉపయోగపడని ఎన్నో చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమోదింపజేశారుగానీ మూడు దశాబ్దాలుగా మాదిగ ఉద్యమాన్ని మాదిగల కోరికను నీరుగారుస్తూ కమిటీలతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో “మాదిగల పంతం -బిజెపి అంతం ”అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బూదాల బాబురావు, మాదిగ సంక్షేమసంఘం అధ్యక్షులు గద్ద యాదయ్య, దళిత బహుజన సంఘం అధ్యక్షులు గజ్జల మల్లికార్జున్, మహ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు నర్సింగరావు, బిఎస్ఎఫ్ కన్వీనర్ బొరెల్లి సురేష్, మాదిగ శక్తి అధ్యక్షులు సురేందర్ సన్నీ, తెలంగాణ దళిత దండు అధ్యక్షులు మొగులయ్య, మాదిగ జేపీసీ నాయకులు కరణ్, గోపాలకృష్ణ, బుర్ర సురేష్, యాదయ్య, గద్దల రమేష్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్, కార్తీక్ పాల్గొన్నారు.

## లంబాడీ గిరిజన జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్

**-సింగరేణి సీఎండీ బలరాం నాయక్**



ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతివేడుకల్లో పాల్గొన్న సీఎండీ బలరాం నాయక్ తధితరులు

**తార్నాక, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** లంబాడీ గిరిజన జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ అని సింగరేణి సీఎండీ బలరాం నాయక్, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ లు పేర్కొన్నారు. ఓ.యూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ. మంగునాయక్ ఆధ్వర్యంలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఓ.యూలో ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా మహాభోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓ.యూ ఎన్‌సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు బంజారా నృత్య ప్రదర్శనతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన సింగరేణి సీఎండీ బలరాం నాయక్, మాజీ ఎంపీ సితారామ్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అధికారికంగా సేవాలాల్ జయంతి వేడుకలను జరుపాలని కోరారు. జయంతి రోజు ఆప్షనల్ హాలీడే కాకుండా సాదారణ సెలవుదినంగా ప్రకటించాలన్నారు. సంత్ సేవాలాల్ జీవిత చరిత్రను ఒక పుస్తక రూపంలో రూపొందించాలన్నారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లంబాడీల జీవితాలను ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ప్రొ.రెడ్యానాయక్, ప్రొ.రాజేందర్ నాయక్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రాములు నాయక్, చంద్రునాయక్, బీసీ సెల్ డైరెక్టర్ చెలమల వెంకటేశ్వర్లు, ప్రొ.గోపాల్ నాయక్, ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ బాలు నాయక్, ప్రొ.సుశీల తధితరులు పాల్గొన్నారు.

### గ్రేటర్ పరిధిలో డీసీఎం, గూడ్స్ వాహనాల ఎంట్రీ సమయం పెంచాలి

**-భారత్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్‌మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ డీసీఎం గూడ్స్ వాహనాల ఎంట్రీ సమయాలను పెంచాలని డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని బిఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వి.సమ్మయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు ఎం.డి.హబీబ్, హెవీ వెహికిల్, యూనియన్ రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆల్లూరి రవిశంకర్ మాట్లాడుతూ డీసీఎం, గూడ్స్ వాహనాల డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, లేనిపక్షంలో ఉద్యమబాట పటాల్సి వస్తుందని హెచ్చరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గూడ్స్, డీసీఎం, నిర్మాణ వాహనాలు గ్రేటర్ పరిధిలోకి వస్తే ఛలాన్ రాయడం కోసం సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ల ద్వారా పగలు నో ఎంట్రీ సమయం ఇస్తూ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. డీసీఎం వాహనాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు అనుమతించాలని, నిర్మాణ వాహనాలురాత్రి 10 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు అనుమతించాలని, డీసీఎం, ఇతర గూడ్స్ వాహనాలకు నోఎంట్రీ సమయంలో బండి వస్తే రూ.2వేల నుంచి రూ.5వేలు, మినిమం రూ.100 నుంచి రూ.500 వరకు మాత్రమే చలాన్ రాయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్ మూదిరాజ్, సిటీ లైట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి జహంగీర్, డీసీఎం యూనియన్ నాయకులు అన్వర్, శ్రీనివాస్, వాసీం, అక్బర్, సూరి, జహంగీర్, శంకర్‌యాదవ్, ఖాన్, మహబూబ్, షరీఫ్, అక్బర్, ఖదీర్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్యగౌడ్, స్కూల్ వ్యాన్ యూనియన్‌అధ్యక్షుడు శాయులు, ప్రధాన కార్యదర్శి వజ్ర లింగం పాల్గొన్నారు.

### నిండుప్రాణం బలిగొన్న టెస్టుడ్రైవ్ ..సెక్యురిటీగార్డు పైకి దూసుకువెళ్లిన కారు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** టెస్టుడ్రైవ్ ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. పక్కకు తిప్పుతున్న కారు ఒక్కసారిగా వేగంతో ముందుకు దూసుకురావడంతో అక్కడే ఉన్న సెక్యూరిటీగార్డుపైకి వెళ్లింది. దీనితో తీవ్రగాయాలకు గురైన సెక్యూరిటీగార్డు అక్కడికి అక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ ఎపిహెచ్‌బికాలనీలో నివాసముండే ఒక్కనగరి పెద్దోళ్ల శివయ్య కుత్బుల్లాపూర్ చౌరస్తా సమీపంలోని ఆగ్రో ఫెస్ట్స్ సమీపంలో గల ఓకారు మెకానిక్ గ్యారేజీ షెడ్డులో సెక్యురిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మెదక్ జిల్లా మక్తాబూపతిపూర్‌కు చెందిన వీరి కుటుంబం రెండు నెలలక్రితం నగరశివారు చింతల్‌లో నివాస మేర్పరుచుకుంది. గురువారం షెడ్డులో పనిచేసే రాఘవేందర్, ఇమ్రాన్‌లు షెడ్డులోకి కారును నడుపుకుంటూ టెస్టుడ్రైవ్ చేస్తుండగా అక్కడ కుర్చీలో కూర్చున్న శివయ్యపైకి కారు దూసుకువెళ్లింది. దీనితో కాళ్లువిరిగి అతనిమీదినుండి కారు దూసుకు వెళ్లడంతో అతడు తీవ్ర గాయాలకు గురైఅక్కడికి అక్కడే మృతిచెందాడు. ప్రమాదాన్ని గమనించిన మెకానిక్ షెడ్డు నిర్వాకులు స్థానికులు వెంటనే శివయ్యను షాపూర్‌నగర్‌లోని రామరాజ ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అత్యాచారం కేసులో ఓ పార్టీకి చెందిన నాయకుడు అరెస్ట్

**చార్మినార్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటనలో పాతబస్తీ దూద్‌బౌలికి చెందిన ఓ ఇంటర్నెట్ నిర్వాహకుడు, ఓ రాజకీయ పార్టీ దూద్‌బౌలి డివిజన్ అధ్యక్షుడి (39)ని కామాటిపుర పోలీసులు అరెస్ట్ చేశారు. చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ కథనం ప్రకారం.....దూద్‌బౌలి నివాసి ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ప్రస్తుతం దూద్‌బౌలి డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఎన్నో సంవత్సరాలు నుంచి స్థానికంగా ఇంటర్నెట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. తరచుగా ఓ మైనర్ బాలిక జిరాక్స్ కాపీలు కోసం ఇంటర్నెట్ సెంటర్‌కు వస్తుండేది. ఈ క్రమంలోనే ఇంటర్నెట్ నిర్వహిస్తున్న రాజకీయ నాయకుడికి ఆ మైనర్ బాలికతో పరియం ఏర్పడింది. మైనర్ బాలికపైన రాజకీయ పార్టీకి చెందిన డివిజన్ అధ్యక్షుడు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ బాధితరాలి తండ్రి కామాటిపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఓ రాజకీయ పార్టీకి చెందిన దూద్‌బౌలి డివిజన్ అధ్యక్షుడుపై ఫోక్సో యాక్టు చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసును కామాటిపుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానాస్పద స్థితిలో కట్టెలవ్యాపారి ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

అనుమానాస్పద స్థితిలో ఓ కట్టెల వ్యాపారి దుకాణంలో నైలాన్‌తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుత్బుల్లాపూర్ డివిజన్ రామకృష్ణనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డిజిల్లా నిజాంపేట మండలం జమ్మికుంటకు చెందిన ల్యాగల జానయ్య(59)బార్య బూదెమ్మలు 30 సంవత్సరాలక్రితం నగర శివారు చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో నివాసమేర్పరుచుకుని కట్టెలవ్యాపారం చేస్తున్నారు. రామకృష్ణనగర్‌లో కట్టెలవ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈనెల 14న ఇంట్లో రాత్రితొమ్మిది గంటలకు ఫోన్‌రావడంతో వెంటనే వెళ్లిపోయాడు. ఆరాత్రి ఇంటికి రాకపోవడంతో పాటు దుకాణం చుట్టుపక్కలవారు బూదెమ్మకు ఫోన్‌చేసి తెలపడంతో వెళ్లిచూడగా భర్త బూదెల జానయ్య దుకాణంలో నైలాన్‌తాడుతో పైకొక్కానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. ల్యాగల జానయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

### జ్యూయలరీ దుకాణం దోపిడీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

**మలక్‌పేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మలక్‌పేట అక్బర్‌బాగ్ చౌరస్తాలో బుధవారం మిట్ట మధ్యాహ్నం జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను మేడ్చల్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు వినికిడి. నిందితులను విచారణ చేస్తున్నట్లు త్వరలో మీడియా ముందుకు నిందితులను చూపనున్నట్లు సమాచారం. నిందితులు పలు కేసుల్లో ఉన్నట్లు సమాచారం.

### నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరి అదృశ్యం..

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ఒక మహిళ, ఓ బాలిక అదృశ్యమైన సంఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం నేపాల్‌కు చెందిన తారాదేవి (37) కుమారుడు దినేష్, కూతురు ఉష (10)లతో కలసి ఓల్డ్ సఫిల్‌గూడలో నివాసముంటున్నారు. తారాదేవి స్థానికంగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తుంది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీనా తారాదేవి, ఉషలు ఇంటి నుండి వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన దినేష్ తెలిసిన, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### సినిమాటోగ్రాఫర్ సెంథిల్‌కుమార్ భార్య మృతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** దర్శకుధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి మెజారిటీ చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ భార్య రూహీ మృతి చెందారు. గత కొన్ని రోజులుగా సికింద్రాబాద్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న ఆమె గురువారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. రుహీ వృత్తిరీత్యా యోగా శిక్షకురాలు. హీరోయిన్ అనుష్క శెట్టి దగ్గర చాలా కాలం పాటు ఆమె పనిచేశారు. కోవిడ్-19 నుండి ఆమె ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లుగా తెలుస్తోంది. ఈ మధ్య అరోగ్య సమస్యలు ఎక్కువ అవడంతోసికింద్రాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. గురువారం ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో పాటు మల్టీ ఫుల్ ఆర్గాన్స్ పనిచేయకపోవడంతో రూహీ తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మరణం చిత్ర పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది.

## ‘సాహితీ భీష్మ’ పేరుతో పురస్కారాల



డాక్టర్ పోతుకూచి సాంబశివరవవు సాహితీ పురస్కారాలను ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** భారతదేశ మానవాళి అతి పురాతనమైందని, వారి ఆచార వ్యవహారాలు సమిష్టి కుటుంబ సంక్షేమం ప్రగతికి మూలమని వైఎస్ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ అధినేత వైఎస్ఆర్.మూర్తి అన్నారు. వైఎస్ఆర్.చారిటుబుల్ ట్రస్ట్ ఆధర్యంలో ‘హృదయ స్పందన’ కార్యక్రమం వేడుకగా సాగింది. కార్యక్రమానికి ప్రముఖ నర్తకీమణి డాక్టర్ కిరణ్మయి ప్రసంగిస్తూ మన సంస్కృతి, జీవన లక్ష్యాలు, కళలపైగల ఆసక్తి ఎంతో ఆనందాన్ని, జీవన సాఫల్యత కలుగచేసిందన్నారు. ప్రముఖ న్యాయవాది, విశ్వసాహితి కోశాధికారి పాల్గొని కార్యక్రమంలో పాల్గొన్న కవులందరికి ‘సాహితీ భీష్మ’ పేరుతో డాక్టర్ పోతుకూచి సాంబశివరవవు సాహితీ పురస్కారాలను అందించి గౌరవించారు. నాట్యకళాకారులు చతుర్య, అనిక నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. గాయనీమణులు లక్ష్మి లక్క, రేవతి, ఇందిర, కల్యాణి, మంజుల పాటలు, సాహితీయోధులు శ్రీరామ్‌కిషన్, ప్రసాద్, కామేశ్వరి, ముదుంబై ఝాన్సీ, సుమిత్ర, కిరణ్, అన్నపూర్ణ, ఎన్.రఘురామమూర్తి తదితరులు అనేక మంది పాల్గొని తమ హృదయ స్పందన అంశంపై కవితలను వినిపించారు. నాట్యకళాకారులకు, గాయకులకు, కవులకు, నిర్వాహకులు ఘనంగా సత్కరించి సన్మానపత్రాలను అందించారు. సంస్థ ప్రతినిధులు శ్రీదేవి, ప్రకాశ్‌రావు, సౌజన్య, షహానా, రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతోనే యువతలో చైతన్యం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి, పెరిక సురేష్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** యువతలో క్రీడాస్ఫూర్తిని నింపి మరింత చైతన్యవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వరల్డ్ హిందూ లయన్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న క్రీడా పోటీల పోస్టర్‌ను గురువారం కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ఈసందర్బంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నేటియువతరం విద్యతోపాటు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. వరల్డ్ హిందూ లయన్స్ వ్యవస్థాపకులు , బిజెపి ఓబిసి మోర్చా నేషనల్ మెంబర్ పెరిక సురేష్ మాట్లాడుతూ యువతలో క్రీడా స్పూర్తిని నింపేందుకు ఖేలో ఇండియా జీతో క్రికెట్ పోటీలు నల్గొండ పార్లమెంట్ పరిధిలోని 41 మండలాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 18ఏళ్ల పైబడిన యువతతో ప్రతిమండలంలో ఒకటీమ్ ఎంపిక చేసి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రికెట్ పోటీలు ఈనెల 23నుంచి 26వరకు మొదటిదశలో నియోజకవర్గ స్థాయిలో మండలాలు, రెండవ దశలో పారన్లమెంట్ నియోజకవర్గాల మధ్య పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పార్లమెంట్ విజేత నిలిచిన జట్టుకు నగదు బహుమతితోపాటు ట్రోఫీలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 18లోగా మండలాల వారీగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈనెల 24నుంచి 25వరకు సెపక్ తక్రా పోటీలు నిర్వహించనున్నట్లు పెరిక సురేష్ పేర్కొన్నారు.

### భారతీయ ఇతిహాసాలలో నైమిశారణ్యంకు ప్రత్యేక స్థానం

**-చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** పురాణ ఇతిహాసాలను ప్రతి ఒక్కరు ఆచరించి తెలుసుకోవాలని చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ అన్నారు. నైమిషారణ్యం వేదాలు, మహాభారతం, విష్ణుసహస్రనామాలు, 18 పురాణాలు, శాస్త్రాలు, సత్యనారాయణ వ్రతం, వ్యాసమహర్షి రచించినవి, పుట్టిన చోటు అని అన్నారు. మొట్టమొదటిసారిగా సూతమహర్షి శౌనకాది మహాముణులకు చెప్పిన పవిత్రమైన చటు నైమిషారన్యం అని, గోమతి నదిఒడ్డున ఉందని, లలితాదేవి అక్రమవారి చక్రతీర్థం, వ్యాసగద్దె, భూతనాథ దేవాలయం, హనుమాన్ గుడి, 88 వేలమంది మహరుషులు తపమాచరించిన పవిత్రమైన స్థలం అని అన్నారు. అనాధిగా వస్తున్న భారతీయసంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, భక్తిప్రపత్తులతో ఆచరించినప్పుడే దేశం అన్నిరంగాల్లో పురోగమిస్తుందన్నారు.

### నగర కేంద్రగ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జ్‌గా పళని కదివరన్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** అశోక్‌నగర్ హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జ్‌గా హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) పళని కదివరణ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సంస్థ చైర్‌పర్సన్‌గా గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న ప్రసన్న రామ్మూర్తి ఉండగా రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో ఉన్న వారిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఆ స్థానంలో పర్సన్ ఇంచార్జ్‌గా పళిని కదివరణ్‌ను నియమించారు.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షో పాల్గొన్న మోడల్స్

## బీసీల వాటాలు, రిజర్వేషన్లకోసం పోరాటం చేయాలి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి



నరేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్‌లో జరిగిన జాతీయ ఓబిసి సదస్సులో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రావులకోల్ నరేష్ ప్రజాపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రజాపతిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, యువజన నాయకుడిగా అనేక సమస్యలపై పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించి ఈ స్థాయికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మీ సేవలు రాష్ట్రస్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో చేయాలని ఓబీసీ కులాలకు రావాల్సిన వాటాలు, రిజర్వేషన్ అమలులో మరింత పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ ధన్‌రాజ్‌గౌడ్, బొక్క వంశిధర్‌రెడ్డి, కొండా సుధీర్‌గౌడ్, సంరెడ్డి ప్రసూన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిప్యూటి కమిషనర్‌గా ఆంజనేయులు



ఉప్పల్ డిసి అంజనేయులును సత్కరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

**ఉప్పల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** ఉప్పల్ డిప్యూటి కమిషనర్‌గా జి.అంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటి కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసును నల్లగొండ జిల్లాకు బదిలీ చేసిన ఆయన స్థానంలో గ్రేటర్‌లో పనిచేస్తున్న అంజనేయులను ఉప్పల్ సర్కిల్ డిసిగా నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణ, టిపిఎస్ సురేష్ ఇతర సిబ్బంది కొత్త కమిషనర్ అంజనేయులుకు పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు. అదే విధంగా డిఇ చందన చౌహాన్, శానిటరీ సూపర్‌వైజర్ కె.సుదర్శన్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కొత్త డిసి అంజనేయులు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమసమస్యలను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా : ఉప్పల



నియామక పత్రాలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తామనిఅంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఐవిఎఫ్ వికారాబాద్ జిల్లా, పట్టణ నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా నాగోల్ క్యాంపు కార్యాలయంలో గురువారం వారికి ఉప్పల శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఐవిఎఫ్ వికారాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీగా కల్వ శేషాద్రి, పిఆర్‌ఓగా డి.గురురాజ్, సాంస్కృతిక కార్యదర్శిగా జి.గౌరీ శంకర్, మీడియా కమిటీ ఇంఛార్జి కె.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎమ్.రాజుకుమార్, శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ ఎమ్.హరీష్‌కుమార్, సేవాదల్ కమిటీ సెక్రటరీగా ఆర్.సతీష్‌కుమార్, వికారాబాద్ పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడుగా కల్వ జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా పోల వంశీకృష్ణ, సెక్రటరీ జి.ప్రణయ్‌చంద్ర, కోశాధికారిగా కల్వ సాయి, జాయింట్ సెక్రటరీ ఎమ్.రఘురాం నియామకమైన వారికి నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు పూర్తవుతుందని, దేశ వ్యాప్తంగా 17 కోట్ల మంది వైశ్యుల పాపులేషన్ ఉందని, ఐవిఎఫ్ అన్ని రాష్ట్రాలలో చురుగ్గా పనిచేస్తూ ఆర్యవైశ్యల కోసం పోరాటం చేస్తుందన్నారు. ఆర్యవైశ్యులకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందేలా చేస్తానని, మెరిట్ సాధించిన పేదలకు స్కాలర్‌షిప్ ఇప్పిస్తామన్నారు. గ్రామ, రాష్ట్ర స్థాయిలో ఐవిఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆర్యవైశ్యులు వ్యాపారం తోపాటు సామాజిక సేవలోను ముందుంటారని, ఇకముందు కూడా అలాగే ఉండాలన్నారు. సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రిలిమినరీ పాసయి ఐఎఎస్ చదువుతున్న 35 మందికి ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఐవిఎఫ్ యూత్ స్టేట్ జనరల్ సెక్రటరీ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రొంపల్లి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ ధర్మబిక్షం సేవలు మరువలేనివి



ధర్మబిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** సిపిఐ మన్సూరాబాద్ డివిజన్ శాఖ కార్యదర్శి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ ధర్మ బిక్షం 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధరబిక్షం చేసిన సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సరూర్‌నగర్ మండల కార్య దర్శి భాతరాజు నర్సింహ, పూజారి అనిత, పార్వతమ్మ, స్వామి, యాదయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

**నాగోల్ చౌరస్తాలో...** స్వాతంత్ర సమరయోధుడు బొమ్మగాని ధర్మబిక్షం జయంతిని గురువారం నాగోల్ చౌరస్తాలో నిర్వహించి ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చేతివృత్తిదారుల సంఘాల సమాఖ్య నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బొమ్మగాని నాగభూషణం హాజరై మాట్లాడుతూ కార్మిక కర్షకుల అభ్యున్నతికోసం ధర్మబిక్షం నిరంతరం పోరాటం చేసారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ బషీర్, ఉడతల మల్లేష్ గౌడ్, ఎండి. ఇస్మాయిల్, హుస్సేన్, కే.శ్రీనివాస్, జి.రాజు, మల్లయ్య, పి.మల్లేష్, కృష్ణ, ఏ.నరసింహ పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఎసిపిగా పురుషోత్తంరెడ్డి



ఎసిపిగా బాధ్యతలు చేపట్టిన పురుషోత్తం రెడ్డిని సత్కరిస్తున్న సిఐ ఎలక్షన్‌రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 15 ప్రభాత వార్త :** మల్కాజిగిరి ఎసిపిగా పురుషోత్తంరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎసిపిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఉన్నతాధికారులు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉప్పల్ సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ మధుసూధన్, రమేష్, నెహ్రు తదితరులు కొత్త ఎసిపి పురుషోత్తంరెడ్డిని కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ నేరాల నివారణకు ప్రజలు తమ వంతు సహకరించాలని కోరారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపి వద్దిరాజు రవిచంద్రకు ఎమ్మెల్యేల సత్కారం



రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్ వేసిన సందర్భంగా ఉప్పల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిలు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యునిగా వద్దిరాజు రవిచంద్రను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీకి ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌నగర్‌లో ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్ డిఎస్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, రఘుపతినాయక్, సోమ్లానాయక్, కృష్ణ, దేవలాల్ నాయక్, మాల్యా, భీమ్లానాయక్, సక్రిభాయి, జకోలిభాయి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణి



పరీక్షా ప్యాడ్‌లను అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు సిద్దప్ప

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ కాలనీలోనున్న శ్రీ విద్య ఐఐటి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థుల కు స్థానిక నందిహిల్స్ ఫేజ్-2 కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరమోని సిద్దప్ప పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశా రు. వచ్చే నెలలో జరిగే పదవ తరగతి పరీక్షలను పురస్కరించుకొని విద్యార్థుల కు ఆయన స్వంత ఖర్చుతో తన సతీమణితో కలిసి ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల మనిషి ధర్మబిక్షం జయంతి వేడుకలు



ధర్మబిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున సిపిఐ నాయకులు

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం జయంతి సందర్భంగా సిపిఐ మల్కాజిగిరి మండల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గీతా పనివారాల సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.యాదయ్య గౌడ్ మాట్లాడుతూ ధర్మబిక్షం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారని ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువతకు ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, ఎ.నిరంజన్‌గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి బి.యాదగిరి, కే.ప్రభాకర్, ఏం.లింగం, కమలాకర్, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

**ఉప్పల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హబ్సిగూడలోని వెలుగుగుట్ట సమీపంలోని ఆలయంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకలకు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మల్కాజిగిరి పార్లమెంట్ నేత తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ వారికి ఎంతో సేవ చేశారని, బంజారా జాతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. బంజారా కులస్థులతో చైతన్యం తీసుకుని వారికి వారికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగుగుట్ట సేవాలాల్ ఆలయ కమిటి చైర్మన్, మాజీ కౌన్సిలర్ గోవర్ధన్‌నాయక్, ఆలయ కమిటి సభ్యులు బి.పద్దియానాయక్, దేశానాయక్, బానోతు రమేష్‌నాయక్, ధర్మేందర్‌నాయక్, శంకర్, బిజెపి సీనియర్ నేతలు బి.రఘపతిగౌడ్, చెల్లోజు ఎల్లాచారి, ఆలే నరేంద్ర, కె.రవితేజ, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ రూ.56.67 కోట్లకు ఆమోదం




ప్రసంగిస్తున్న మేయర్ దుర్గ: పక్కన విక్రంరెడ్డి, కమీషనర్ చంద్రశేఖర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 2024-25 ఆర్థికసంవత్సరానికిగాను నిర్దేశించిన రూ.56.67 కోట్లఅంచనా బడ్జెట్‌కు కార్పొరేషన్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. మీర్‌పేట్ కార్పొరేషన్ భవనంలో గురువారం నూతన కమీషనర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇతరత్రా వాటికి సంబంధించిన దానిపై రూపొందించిన వార్షిక బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. రూ.56.67 కోట్లకు సంబంధించిన సాధారణ అంచనా బడ్జెట్‌ను కార్పొరేషన్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కౌన్సిల్‌లో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, చల్లా కవితా బాల్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్ ఎస్ఇ ఆంజనేయులు, ఎఇలు శ్రీనివాసులు, మహిపాల్, టిపిఓ దేవానంద్, మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అంజన్‌రెడ్డి, అకౌంటెంట్ సుహాసిని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కమిషనర్‌గా రఘు బాధ్యతలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమీషనర్‌గా జి.రఘు బాధ్యతలు చేపట్టారు. కమీషనర్ల బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై బడంగ్‌పేట్‌కు వచ్చారు. గతంలో ఆయన పోచారం, కొంపల్లి మున్సిపాలిటీలు, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లకు కమీషనర్‌గా పని చేశారు. కాగా బడంగ్‌పేట్‌లో పని చేస్తున్న కమీషనర్ బడుగు సుమన్‌రావు ఆయనకు బుధవారం సాయంత్రం ఛార్జి అప్పగించి రిలీవ్ అయ్యారు. అయితే గురువారం ఉదయం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నూతన కమీషనర్ రఘును సన్మానించారు. అదేవిధంగా బదిలీ అయిన బడుగు సుమన్‌రావును గురువారం మేయర్ పారిజాత సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమీషనర్‌గా సుమన్‌రావు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఇఇ జ్యోతిరెడ్డి, ఎఇఇ వినీల్‌గౌడ్, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ నగేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంగూడలో ఘనంగా సేవాలాల్ జయంతి



సేవాలాల్‌కు పుష్పం సమర్పిస్తున్న పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో బంజారాల ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బంజార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం జయంతి వేడుకలు



ధర్మబిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రధాన చౌరస్తాలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ గీత పనివాళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యాల యాదిరెడ్డిలు మాట్లాడుతూ విభిన్న నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమ కలిగిన, అరుదైన నాయకుడు ధర్మబిక్షం అని, వందేమాతరపిలుపుతో దేశ స్వాతంత్ర సంగ్రామంలో, ఆంధ్ర మహాసభ సంస్థలో సభ్యుడిగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట మహాసంగ్రామంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ మట్టి మనుషుల వెట్టి చాకిరి విముక్తి కోసం అహర్నిశలు శ్రమించి జైలు జీవితం అనుభవించిన ఘనమైన నాయకుడని పేర్కొన్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలలో వృత్తి సంఘాలను ఏర్పాటుచేసి మట్టి మనసులను తట్టిలేపిన విలక్షణ నాయకుడని, ఎంపి, ఎమ్మెల్యేగా ప్రజా సంక్షేమం చేసిన గొప్ప ప్రజాసేవకుడని, భూ పోరాటాలు నిర్వహించి వేలాది మందికి భూమిని పంచిన నిజమైన నిస్వార్థమైన కమ్యూనిస్టు మహా నాయకుని సేవలు గుర్తు చేసుకుంటూ ఆయన విగ్రహానికి నివాళులర్పించారు, కార్యక్రమంలో నాయకులు పబ్బతి లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, తొర్పునూరి ప్రవీణ్‌గౌడ్, దిగోజు వేణుగోపాల్, కేతరాజు నరసింహ, పొన్నాల యాదగిరి, దాసరి ప్రసాద్, వట్టి నవనీత నారాయణరెడ్డి, దాదిమల్ల నారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్



ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్ తదితరులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** సద్గురు శ్రీ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలను అదర్శనగర్‌లో ఘనంగా నిర్వహించారు. చేయడం ఈ కార్యక్రమానికి హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం, హిందూ ధర్మం గొప్పతనం గురించి బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడని, తన పాటలు రచనల ద్వారా ప్రజలను జాగృతం చేయడానికి అనేక ప్రబోధాలను బోధించాడంతో సేవాలాల్ అన్ని కులాల వారికి కూడా ఆదర్శమూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారానాయకులు చందు, భీమ్లా, లాలూ, రఘు తదితరులు పాల్గొన్నారు.

## నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న రాజిరెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శివాలయం ముందు రోడ్డు గుంతలమయంగా మారి మురుగునీరు గుంతల్లో నిల్వ ఉంటుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దేవాలయం ముందు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు.

## బీరప్పగడ్డలో సివరేజ్ పైప్ లైన్ పనులు



సివరేజ్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలో కొత్తగా చేపడుతున్న సివరేజ్ పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ వేయిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు యుద్దప్రాతిపధిక పూర్తి చేస్తున్నామని తెలిపారు. డివిజన్ అభివృద్దికి నిధులు కేటాయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, బాలు, శ్యామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కొత్త కమిషనర్ చంద్రశేఖర్ బాధ్యతలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ నూతన కమీషనర్‌గా బి.చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మెహదీపట్నం సర్కిల్‌లో కమీషనర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై మీర్‌పేట్‌కు వచ్చారు. ఇక్కడ పని చేస్తూ తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి బదిలీ అయిన వాణిరెడ్డి నూతన కమీషనర్ చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌కు ఆయన నూతన కమీషనర్‌గా బాధ్యతలు ప్రారంభించారు. అయితే చంద్రశేఖర్ గతంలో సంగారెడ్డి మున్సిపాలిటీలో పని చేశారు. కాగా మీర్‌పేట్‌కు కొత్తగా వచ్చిన మరునాడే కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం జరగడం గమనార్హం.

## సిల్వర్ డ్రాప్స్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** జిల్లెలగూడలోని సిల్వర్ డ్రాప్స్ పాఠశాలలో చిన్నారుల అక్షరాభాస్య కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల ఛైర్మన్ జె.శ్రీనివాసరావు చిన్నారి విద్యార్థులచే పలకలపై అక్షరాలను దిద్దించి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి విద్యార్థులకు విటమిన్ డ్రాప్స్



చిన్నారులకు విటమిన్ డ్రాప్స్ వేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి రాజు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జనప్రియా మహానగర్‌లో గురువారం అంగన్‌వాడి పిల్లలకు విటమిన్ డ్రాప్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమూరి విజయలక్ష్మి రాజు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎ విటమిన్ డ్రాప్స్ వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రానికి చెందిన టీచర్ ఎస్.సరోజ, ఎఎన్ఎం మంజుల, సంధ్య, అంగన్‌వాడి పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చిన మహనీయుడు కామ్రేడ్ ధర్మబిక్షం



ధర్మబిక్షానికి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడంతో పాటు స్వాతంత్రానంతరం ప్రజా సమస్యలపై ఉద్యమించిన ధర్మబిక్షం అడుగుజాడల్లో నడిచి యువత ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. ధర్మబిక్షం జయంతిని పురస్కరించుకుని సీపీఐ హయత్‌నగర్ మండల సమితి కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ... చిన్నతనం నుంచి విప్లవ భావాలతో ఎదిగి తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. దున్నేవాడిదే భూమంటూ పేదరైతులకు భూములు పంచిన మహనీయుడన్నారు. ప్రజలలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాఠశాలలను, వసతి గృహాలను నెలకొల్పి ఉచిత విద్య అందించారని కొనియాడారు. రెండు దఫాలు పార్లమెంట్ సభ్యుడిగా శాసనసభ్యుడిగా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని అన్నారు. ప్రజలో మార్పు తెచ్చిన చరిత్రకారుడి గురించి నేటి తరం యువత తెలుసుకుని ఆయన ఆశయాలను సాధించేందుకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సోమన్న, నాయకులు శ్రీదేవి, సరిత, సౌజన్య, అరుణ, సుజాత, అనిత, అనిల్, అశోక్ పాల్గొన్నారు.